ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04.04.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని బి.ఆర్.ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.

2. సంగారెడ్డి జిల్లాలోనిన్న ఒక రసాయన కర్మాగారంలో జరిగిన పేలుడు ప్రమాదంలో మరణించిన వారిసంఖ్య 6 కు చేరింది.

3. ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటు వేయడానికి వీలు లేదంటూ సామాజిక మాధ్యమాలలో ప్రచారంలో ఉన్న తప్పుడు సందేశాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

4. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏనుగు దాడితో , నిన్న మానేపల్లి మండలంలో ఒక రైతు మరణించిన ఘటన మరువకముందే, ఈరోజు కూడా ఏనుగు దాడిలో మరో రైతు మరణించాడు.

KTR-BRS

రాష్టంలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని బి.ఆర్.ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితిపై ఆయన ముఖ్యమంత్రికి ఈరోజు బహిరంగ లేఖరాశారు. గతంలో తమ ప్రభుత్వం చేనే త కార్మికులకోసం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలు ప్రస్తుతం వారికి అందడం లేదని ఆరోపించారు. చేనేత కార్మికులకు గతంలో అమలైన అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.

సంగారెడ్డి ప్రమాదం....

సంగారెడ్డి జిల్లా , చందాపూర్ శివారులోని ఎస్ బి ఆర్గానిక్ కెమికల్స్ కర్మాగారంలో నిన్న జరిగిన రియాక్టర్ పేలుడులో మరణించినవారి సంఖ్య ఆరుకు చేరుకుంది. పేలుడులో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించగా , మరొకరు చికిత్స పొందుతూ మరణించారు. ఇంకొక మృతదేహాన్ని శిధిలాల క్రింద గుర్తించారు. గాయపడిన వారిని ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు పలు ఆస్పత్రులలో చేర్చి చికిత్సఅందిస్తున్నారు. రియాక్టర్ లో ఆయిల్ లీకేజి కారణంగా ప్రమాధం సంభవించినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తో పాటు జిల్లా అగ్నిమాపక శాఖధికారి శ్రీధర్,ఆర్ డి ఓ వసంత కుమారి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. M N R ఆస్పత్రి, సంగారెడ్డి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను మాజీ మంత్రి హరీష్ రావు ఈ ఉదయం పరామర్శించారు.

--పిటిసి, సంగారెడ్డి

పోస్టల్ బ్యాలట్:

సామాజిక మాధ్యమాలలో, వాట్సప్ ద్వారా ప్రచారంలో ఉన్న తప్పుడు సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని భారత ఎన్నికల కమిషన్ సూచించింది. ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటు వేయడానికి వీలు లేదంటూ ప్రచారంలో ఉన్న తప్పుడు సందేశాల విషయం తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. ఎన్నికల విధి నిర్వహణలో ఉండే , అర్హులైన ఉద్యోగులు నిర్దేశిత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలట్ హక్కు వినియోగించుకోవచ్చని పేర్కొంది. నకిలీ సందేశాలు , తప్పుదారి పట్టించే సందేశాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. అటువంటి తప్పుడు

సందేశాలను పట్టించుకోవద్దని సూచించింది. అధికారిక సమాచారం కోసం ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ ను చూడాల్సిందిగా కోరింది.

--ఎన్.ఎస్.డి

వాటర్ ట్యాంక్ – కోతులు...

నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనిలోని తాగునీటి ట్యాంకులో కోతులు పడి చనిపోయిన సంఘటనలో ప్రజలకు ఎలాంటి దుష్పరిణామాలు లేవని , ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీరు నాగేశ్వరరావు తెలిపారు. నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీ ఉన్న ఇళ్ళకు తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకులకు, కోతులు పడి దుర్మరణం చెందిన వాటర్ ట్యాంకుకు ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించి పూర్తిస్థాయిలో ఈ ట్యాంకును క్లోరినేట్ చేసిన తర్వాత తాగునీటిని వదులుతామని ఆయన వెల్లడించారు. అప్పటి వరకు ఈ తాగునీటి ట్యాంకు ద్వారా నీరు పొందుతున్న ఇండ్లకు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పిటిసి, నల్లగొండ

RICE

గడువులోగా CMR కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లర్లు , రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సిఎంఆర్ లక్ష్యాలు తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

PTC, NIRMAL

అదిలాబాద్ :

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి అయిందని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఆదిలాబాద్ లోని శాంతినగర్ లో ఏర్పాటు చేసిన EVM గోదాంలో జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు , సంబంధిత ఎన్నికల అధికారుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని తెలిపారు.

--పిటిసి, ఆదిలాబాద్

ఓటుహక్కు-ఖమ్మం:

రానున్న లోక్ సభ ఎన్నికలలో ఓటుహక్కు పొందేందుకు అర్హులైన వారు, ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ చెప్పారు. రానున్న లోక్ సభ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 3 వేల 620 మంది పీఓ , ఏపీఓలకు శిక్షణ ఇచ్చామని ఆయన చెప్పారు. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 1 వెయ్యి 459 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు అవుతాయని , వాటిలో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టామని కలెక్టర్ చెప్పారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ జిల్లాలో 12 అంత రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని , ప్రత్యేక బృందాలతో ముమ్మర తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

--పిటిసి, ఖమ్మం

కామారెడ్డి- సర్వే...

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల కొలతలను పక్కాగా లెక్కించేందుకు అధికారులు సర్వే ప్రారంభించారు. కామారెడ్డి పట్టణంలోని పలు వార్డులలో ఇళ్ళ కొలతలు తీసి , వివరా

లను నమోదు చేసుకున్నారు. అనుమతులు ఒక విధంగా నిర్మాణాలు మరోలా ఉండడంతో బల్దియాలకు పూర్తి స్థాయిలో ఆదాయం సమకూరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో సర్వే చేసి వివ రాలను ఆన్లైన్ లో పొందుపరచడానికి చర్యలు చేపట్టింది.

-పిటిసి, కామారెడ్డి

ఓటు హక్కు...

పార్లమెంట్ ఎన్నికల్లో, అర్హులైన వారందరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. కరీంనగర్ స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ ను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.

--కరీంనగర్ పిటిసి

ఏనుగుదాడి....

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మానేపల్లి మండలం లో నిన్న ఏనుగు దాడికి ఒక రైతుమరణించిన ఘటన మరువక ముందే ఈ ఉదయం ఏనుగు దాడిలో మరో రైతు మరణించాడు. జిల్లాలోని పెంచికలపేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కారు పోచయ్య (50) అనే రైతు వ్యవసాయ పనుల కోసం పొలంలో కరెంటు మోటార్ వేయడానికి వెళ్లే క్రమంలో ఏనుగు ఒక్క సారిగా దాడి చేయడంతో పోచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనితో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గత రెండు రోజులలో ఏనుగు దాడి లో మరణించినవారి సంఖ్య 2 కు చేరింది. దీనితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు కోరారు.

-- పిటిసి, కొమురం భీం

నీటి సమస్య.....

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని  సిరిసిల్ల , వేములవాడ మున్సిపాలిటీలు , గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే సమాచారం అందించాలని  రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో కోరారు. తాగునీటి సమస్యలపై ఫిర్యాదులకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని  , ఇది 24 గంటలు పనిచేస్తుందని చెప్పారు. తాగునీటి సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్   93986 84240 కు ఫోన్ చేసి తెలిపితే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

--రాజన్న సిరిసిల్ల పిటిసి

చేపల వేట- వరంగల్

ఈ వేసవిలో భూగర్భ జలాలు  అడుగంటుతున్న నేపథ్యంలో చెరువులు , జలాశయాలు, కుంటల్లో  చాలినంత నీరు లేనందువల్ల మత్స్యకారులు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ నాయుడు సూచించారు. ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడుతూ ఆయన ఎండలు తీవ్రమవుతున్నందువల్ల  చెరువుల్లో తగినంత నీరు లేక , ఆక్సిజన్ అందక చేపలు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

--పిటిసి, వరంగల్